
# భ్రమణకాంక్ష

ఎన్.కె.రామారావు


సంపత్ మనసులో ఆలోచనల జడివాన. బయటి వాతావరణం కూడా అలాగే వుంది. తనకు నలభై అయిదో ఏడు నడుస్తోంది. తాను ఈ జిల్లాలో నెంబర్ వన్ క్రిమినల్ లాయర్‌గా పేరు తెచ్చుకున్నాడు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యాం వుంది.



చరిత్ర పట్ల అవగాహన, భాషాజ్ఞానం, సాహిత్యాభిరుచి, ఒక లాయరును వృత్తిలో రాణింపజేయడానికి దోహదపడతాయి. నిజానికి సంపత్ చాలా అదృష్టవంతుడు. వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తిని తన స్వార్జితంతో ఇబ్బడి ముబ్బడి చేశాడు. మంచి రూపురేఖలు, ఆరోగ్యం అతడిని ఇంకా అందంగా కనిపింపజేస్తాయి. అతని భార్య సువర్చల గొప్ప అందగత్తె కాదు కానీ అలాగని అనాకారి కూడా కాదు. అన్నీ వున్నా అతడిని ఈ మధ్య ఒక తీవ్రమైన అసంతృప్తి వెంటాడుతోంది.

ఈ మధ్య కొంతకాలంగా సంపత్ ఆనందంగా గడపలేకపోతున్నాడు. పరధ్యానం, దీర్ఘంగా సాగే ఆలోచనలు, అతన్ని ఏ విషయం బాధిస్తున్నదో ఎవరూ తెలుసుకోలేకపోతున్నారు. డబ్బుకు, పరువు ప్రతిష్టలకూ విడదీయరాని సంబంధం వుంది. మొదటిది లేకపోతే రెండోది లేదు అని అతను గాఢంగా నమ్ముతాడు కాబట్టి ఆ రెండు విషయాల్లో దేనికీ భంగం వాటిల్లకుండా నడుచుకుంటాడు.

వృత్తిలో తప్ప బాహ్య జీవితంలో సంపత్ ఏపనీ తీరిగ్గా ఆలోచించి మంచి చెడులు వితర్కించి చేయడు. ఆ క్షణానికి తనకు ఏది సబబు అని తోస్తే అది తననుకున్నట్లుగా చేస్తాడు. ''నేను ఏదీ లాజికల్‌గా ఆలోచించి చేయను. సమస్యను బట్టి నా నిర్ణయం అప్పటికప్పుడు తీసుకుంటాను. మనం లాజికల్‌గా ఆలోచించలేనివి వాస్తవ జీవితంలో జరగవు. జరిగిన వాటిని కార్యచరణ సంబంధాలను ఊహించడం మాత్రమే తార్కికులు చేసే పని'' అని అతను తరచూ చెబుతుంటాడు. అనువంశికంగా సంక్రమించిన ఆస్తిపాస్తులు, స్వంతంగా సంపాదించిన ఆస్తి, అతని అందం, వాక్చాతుర్యం అతనికి వృత్తిలో చాలా విజయాలతో పాటుకీర్తి ప్రతిష్టలు, చాలా మంచివాడనే పేరును సంపాదించి పెట్టాయి. వాటికి మచ్చరాకుండా మసలుకుంటాడు. బయట ఎవరికీ తెలియకున్నా అసలు విషయం అతనికి పరాయి స్త్రీ వ్యామోహం కొంచెం హెచ్చుగానే వుంది. అందగత్తెల వైపు దొంగ చూపులు చూసి ఆనందించడం తప్ప అతను ఎవరితోనూ లైంగిక సంబంధాలు పెట్టుకోవడానికి సాహసించ




లేదు. పైపెచ్చు పరాయి స్త్రీలతో వృత్తిపరంగా మాట్లాడాల్సివచ్చినా ఆకాశంలోకో నేలలోకో చూస్తూ మాట్లాడేవాడు. అతని మిత్రులు ఎంత బలవంతం చేసినా ఒక్క కాల్‌గర్ల్‌ను కానీ వృత్తి వ్యభిచారిణిని కానీ ఇంతవరకూ ముట్టుకొని ఎరుగడు.

"భార్యకు ద్రోహం చేయకుండా ఉండడానికా ఇలా మడి కట్టుకొని వుండేది?" అని అంతరాత్మ అడిగితే....

"ఛ..ఛ...అలాంటిది ఏమీ లేదు. స్త్రీ వ్యామోహంతో పాటు పరువు ప్రతిష్టలకు సంబంధించిన ఒక బెరుకు. ఒక భయం నన్ను నీడలా అంటిపెట్టుకొని వుంటాయి. అంచేత ఈ విషయంలో ముందడుగు వేయలేను" అంటాడు. కొంతమంది స్త్రీలు అతని పట్ల వ్యామోహపడుతున్న సంగతి సంపత్ గ్రహించకపోలేదు. కానీ చొరవ తీసుకోలేకపోయేవాడు.

అతని బంధువుల్లో చాలా మంది పెద్ద పెద్ద ఉద్యోగాల్లోనూ, బిజినెస్సుల్లోనూ వున్నవాళ్లు. ఏదైనా మిస్‌ఫైర్ అయితే భార్య ముందు, బంధుబలగం ముందు తలెత్తుకోలేననే భయం అతడి ముందు కాళ్లకు బంధం వేస్తోంది. కళ్ల ముందు ప్రపంచం అందంగా వుంది. అందమైన ఆడవాళ్లు మరింత అందమైన అలంకరణలతో కళ్ల ముందు కనిపిస్తుంటే యవ్వనం వికసించి పువ్వుల్లా కనిపించి జీవితంలోని కష్టసుఃఖాల గురించి భవిష్యత్ గురించి ఏ భయమూ లేని అందమైన అమ్మాయిల గుంపులు కనపడుతుంటే, వాళ్ల తుళ్లింతలు చూస్తుంటే అతని మనసు అసంతృప్తితో మూలిగేది. డబ్బు, వృత్తి విజయాలు ఏమాత్రం ఆనందాన్నివ్వలేకపోతున్నాయి. డబ్బు ఇంకా సంపాదిస్తాను. కానీ చేజారిన యవ్వనాన్ని తెచ్చుకోలేనని బాధ అతడిని తొలిచేస్తోంది.

ఆదివారాలు తన ఆఫీసులో ఒక్కపూటే పనిచేసే తాను ఆ ఆదివారం నాడు తొమ్మిది గంటలకల్లా ఆఫీసుకు వచ్చాడు. రోజువారీ కార్యక్రమంగా బల్లమీద అద్దం కిందున్న దేముళ్ల ఫొటోకు నమస్కరించాడు. గోడకున్న అమ్మవారి ఫొటోకు దండం పెట్టి ఊదుకడ్డీ వెలిగించాడు. అమ్మవారి ఫొటోను కూడా ధైర్యంగా తలెత్తి చూడలేకపోతున్నాడు. ఊదుకడ్డీ నుంచివస్తున్న సన్నని మబ్బురంగు పొగ వలయాలుగా ఒకసారి గాలికి చెదిరి వంకర టింకరగా ఒకసారిపైకి వెళుతుంటే చూస్తున్నాడు. ఆ పొగలో కూడా ఒక సౌందర్యవతి మొహాన్ని ఊహించగలుగుతున్నాడు. ఆకాశంలో మబ్బుల్ని చూసినా అతనికి వాటిల్లో అందమైన స్త్రీ మూర్తులు కనిపిస్తాయి. దేముడి గుడి ముందు వరుసలో నిలబడ్డ ఆడవాళ్లనే చూస్తాడు తప్ప దేముడిని చూడడు. ఒక పత్రికలో మానసిక సమస్యలకు జవాబులిచ్చే ఒక డాక్టరుకు ఫోన్ చేసి విషయం చెప్పాడు.

దానికి ఆ డాక్టర్ "అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్" అనే పేరుపెట్టి పాములు కల్లోకి వస్తున్నాయా? అనడిగాడు.

పాములు కల్లోకి రావడం లేదని చెప్పాడు. విచిత్రంగా ఆ రాత్రి అతని కలల్లోకి అసంఖ్యాకరమైన పాములు కనిపించాయి. ఈ విషయం భార్యతో చెబితే...

"నాగుల చవితికి పుట్టలో పాలు పోస్తాను. ఈ లోపు పానగల్లు శివుడికి వెండితో నాగాభరణం చేయిస్తానని మొక్కండి" అని సలహా ఇస్తూ మీకు తెలియకుండా ఏదైనా పామును తొక్కారేమోనని భయం వ్యక్తిచేసింది.

"నేను ఇంతవరకూ ఏపామునూ తొక్కలేదు. తొక్కాల్సి వుంది" అని వినీ వినిపించకుండా సణిగాడు. తనకు ఇప్పుడు నలభై అయిదు. ఇలా కాలం నిస్సారంగా గడిపి షష్టిపూర్తికి చేరుకుంటాడు. ఒక అడ్వెంచర్, ఒక ఎస్కేప్‌డ్ లాంటిదేమీ లేకుండా ముసలివాడిగా మరణించడం అతనికిష్టం లేదు. అతనెప్పుడూ ఆలోచిస్తుంటాడు. ఏదో ఒక అద్భుతం అకస్మాత్తుగా జరగాలి. తన చొరవ, తన ప్రమేయం లేకుండానే ఓ అందాలరాశి తన ఒళ్లో పడిపోవాలి.

అలా ఆలోచనల్లో వున్న సంపత్ కళ్ల ముందు వికసించిన విద్యుత్తేజంలా... అపర రతీదేవిలాంటి ఒక ఆడమనిషి నిలబడి నమస్కారం చేసింది. అలవాటుగా తొట్రుపడి ఆమెను కూచోమని, సైగ చేసి క్రీగంట ఆమె వైపు చూశాడు. మంచి దబ్బపండురంగు ఛాయ. వెంట్రుకలకు నల్లసిరా పూసుకుందా అనే భ్రమ కలిగించే నల్లటి కేశపాశం. చిన్న చిన్న వంపులు వంపులుగా వెనక్కు పడుతున్న జుట్టు. నది నీళ్లలో గాలికి రేగిన చిన్న చిన్న అలల్ని గుర్తుకు తెస్తున్నది. చెవుల్ని ఒరుసుకుంటూ కిందికి ప్రవహిస్తున్న జుట్టు ఒడ్డును ఒరుసుకుని మలుపు తిరిగిన నదిలాగుంది. కృష్ణ సర్పంలాంటి బలమైన పొడవాటి జడ. విశాలమైన కళ్లు. ఒక కంటిపాపపై తేనె రంగు పుట్టుమచ్చ. ప్రతి అంగుళం ఆరోగ్యం నింపుకున్న శరీరం. సంపత్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

ఆవిడ గొంతు సవరించుకొని "నా పేరు సులోచన" అంది.

"మీ వయస్సు" గొంతు నిండా కుతూహలం.

"ముప్ఫై"

"మీకు నేనేం సహాయం చేయగలనో చెప్పండి"

"చెబుతాను సార్..... నా భర్త ఈ మధ్యే చనిపోయాడు. పోలీసులు నా మీద కేసుపెట్టి అరెస్టు చేస్తాం అంటూ రోజుకు రెండు మూడు సార్లు వచ్చి సతాయిస్తున్నారు"

"మీ భర్త మరణంతో మీకేమైనా సంబంధం వుందా?"

"అలాంటి కేసు ఖాదు సార్" అంటూ తన కాళ్ల దగ్గర వున్న బ్యాగు తీసుకోవడానికి కిందికి వంగింది. సంపత్ అప్పుడు ధైర్యంగా చూశాడు. ఆవిడ వంగగానే వెడల్పుగా విచ్చుకున్న కేశపాశం అతనికి ఇంద్రనీలాలరాశిగా తోచింది. వెంటిలేటర్ ద్వారా ప్రవహిస్తున్న సూర్యకిరణం ఆవిడ జుట్టు మీద ఒక కాంతిరేఖా ప్రసవానికి దోహద పడడం విభ్రమంగా, విస్మయంగా చూసి మెదడంతా ఇదే దృశ్యం ఆక్రమించి ఒక స్థంభీభూతమైన ప్రపంచంలో వున్నట్టుగా మారిపోయాడు. ఇంద్రనీలాల రాశి మీద పెన్ టార్చ్ ప్రసరిస్తే వచ్చే వెలుగులాగుంది. ఈ వెలుగు అనుకున్నాడు.

గొంతు సవరించుకొని ఆమె కేసు వివరాలు కావాలని అడిగాడు.

సులోచన క్షణం పాటు ఏదో భావోద్వేగంలో వున్నట్లు కనిపించింది. ఆమె కళ్లలో విషాదపు నీలినీడలు కదలడాయి. గొంతు సవరించుకొని చెప్పసాగింది.

"నా భర్త పేరు రంగనాథ్". ఈ వూళ్లోనే ఒక చిన్న కిరాణా అండ్ ఫ్యాన్సీ షాపు పెట్టాడు. షాపు బాగానే నడిచేది. తర్వాత ప్రైవేటుగా చిట్టీలు నడిపాడు. అవి కూడా బాగానే నడిచాయి. తర్వాతెందుకో తెలీదు కానీ నా పేర ఒక ఫైనాన్స్‌కంపెనీ పెడతానని అంటుండేవాడు. వద్దని చాలా సార్లు వారించాను. అయినా నాకు తెలీకుండా కంపెనీ

పెట్టడానికి కావాల్సిన రాతకోతలు వ్యవహారాలన్నీ పూర్తి చేసి ఒకనాడు "సులోచనా ఫైనాన్స్ కంపెనీ" అని ప్రారంభోత్సవం ఒక ఎమ్మెల్యే గారిచేత చేయించాడు.

"కొంచెం మంచినీళ్లిప్పిస్తారా" అంటూ ఆగింది సులోచన.

సంపత్ లేచి మినీ ఫ్రిజ్ నుంచి ఒక మంచి నీళ్ల సీసా తీసి అందించాడు. ఆవిడ సీసా ఎత్తి మంచి నీళ్లు తాగుతుంటే ఆవిడ గొంతు కేసి అలాగే చూస్తూ వుండిపోయాడు. గొంతులోంచి జారుతున్న నీళ్లు కనిపిస్తాయేమోనని భ్రమాజనిత విశ్వాసం.

సులోచన గొంతు సవరించుకుంది. "ఎలాగో... ఏమిటో... ఒక పాడు ఊహ ఆయన మనసులో ప్రవేశించింది. ఎవరైనా ఎంత డబ్బయినా మా కంపెనీలో డిపాజిట్ చేస్తే రెండేళ్లకు దానికి రెండున్నర రెట్లు ఇస్తామని ప్రచారం చేశాడు. కొన్ని లక్షల రూపాయలు డిపాజిట్లుగా వచ్చిపడ్డాయి. నా పేరు మీద ఒక ఇల్లుకొన్నాడు.

సులోచన ఆగిపోయింది. జరిగిన సంఘటనలకు సంబంధించిన భయం ఆమె గుండెల్లోంచి గొంతులోకి వచ్చి అడ్డుకున్నట్లుగా ఆగిపోయింది.

"చెప్పండి" సంపత్ ప్రోత్సహించాడు. ఆమె రూపం పట్ల ఆసక్తే కాక తన వృత్తి పరమైన ఆసక్తి కూడా అతని గొంతులో తొంగిచూసింది.

"చెబుతున్నాను. మా ఆయన పెట్టిన గడువు పూర్తి కాగానే ఖాతాదారులు వెంటపడ్డారు. కొన్నాళ్లు వాళ్లకు అవీ ఇవీ చెప్పి ఊరుకోబెట్టాడు. కానీ రాను రాను వాళ్ల ఒత్తిళ్లు, మాటలు భరించలేక పోయారు. వాళ్లు చాలా బూతులు తిట్టేవారు. ఒకడైతే నన్ను వాడి దగ్గర నెల రోజులు పడుకోబెడితే తన డబ్బు వదులుకుంటానన్నాడు"

ఈ మాట పూర్తి కాకుండానే సులోచన దుఃఖంతో వెక్కిళ్లలో కూరుకుపోయింది. సంపత్‌కు ఆ అజ్ఞాత అఘాయిత్యపు ఖాతాదారు మీద కోపం వచ్చి పిడికిళ్లు బిగుసుకుపోయాయి. మళ్లీ మామూలుగా మారి సులోచనను అలా కొంతసేపు ఏడ్వనిచ్చాడు. కొన్ని క్షణాలకు తేరుకున్న సులోచన కొనసాగించనా అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసింది. సంపత్ అంగీకార సూచకంగా తలూపాడు.

"అంతే... ఆ రాత్రే మా ఆయన ఏదో మందు మింగాడు. ఇరుగు పొరుగు సహాయంతో పెద్దాసుపత్రికి తీసుకెళ్లినా లాభం లేకపోయింది. ఆ రాత్రే ఆయన చనిపోయారు" మళ్లీ దుఃఖంలో మునిగిపోయింది.



## కమిట్‌మెంట్స్

**నే**ను అందరిలాంటి దాన్ని కాదు. మాటంటే మాటే. ఏదైనా మనసులో అనుకున్నానంటే చేసి తీరతాను. నా జీవిత భాగస్వామి గురించి కూడా అంతే. ఇంతవరకూ నా కమిట్‌మెంట్స్‌కు తగిన కుర్రాడు కనిపించలేదు. ఆ కమిట్‌మెంట్సేంటో పెళ్లయింతర్వాత చెబుతాను అంటూ విద్యాబాలన్ ఈమధ్య ఓ స్టేట్‌మెంటిచ్చింది. పరిణీత సినిమా తర్వాత నాలో గొప్ప మార్పొచ్చిందని అంటూనే కమిట్‌మెంట్స్ గురించి చెప్పుకొచ్చింది. ఆమధ్య జాన్ అబ్రహామ్‌తో తిరుగుతోందని వార్తలు విన్న వారందరూ ఇప్పుడు అబ్రహామ్ ఈవిడగారి కమిట్‌మెంట్స్‌కి సరిపోడేమో అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. వీళ్లందరికీ తగిన రీతిలో సమాధానం చెబుతానని కూడా అంటోంది ఈ పరిణీత.

కాసేపు అలాగే కన్నీళ్లు పెట్టుకొని వెక్కిళ్లు పడి తర్వాత కొంచెం తేరుకొని మళ్లీ కొంచెం మంచినీళ్లు తాగింది.

"నాకు నా తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. మా మేనమామ దేముడు. ఆయనే నన్ను సాకి పెద్ద చేసి, ఇంటర్ దాకా చదువు చెప్పించాడు. మా అత్తయ్య అంటే మా మేనమామ భార్య కూడా నన్ను తన సొంత కూతురిలా చూసుకుంది. నేను "చతుర్నేత్ర సూపర్ మార్కెట్‌లో" పనిచేసేదాన్ని


కేసు సంగతి వదిలేసి తన సొంత సంగతులు చెబుతున్నానన్న స్పృహ హఠాత్తుగా వచ్చిందాన్లా సర్దుకుంది. కొంచెం సిగ్గుపడుతూ "క్షమించాలి. ఏది ముందు చెప్పాలో ఏది వెనుక చెప్పాలో మరిచిపోయాను. కేసు విషయం చెపుతూ నా సొంత విషయాల్లోకి వెళ్లిపోయాను."

"ఫర్వాలేదు కానీండి. నాకు వినే ఓపిక వుంది." సంపత్ ధైర్యంగా అన్నాడు. ఈవిడకు తన సహాయం కావాలని తేల్చుకున్న మరుక్షణం అతనికి ఎప్పుడూ లేని ధైర్యం వచ్చేసింది. ఆమె కళ్లల్లోకి సూటిగా చూస్తున్నాడు. దృష్టి ఆమె పై నుంచి మళ్లించడం లేదు. ఆమె అది గమనించకుండానే తన గోడు వెళ్లబోసుకుంటోంది.

"ఆ మర్నాడు మా మేనమామ, రంగనాథ్ బంధువుల సహాయంతో అతడి దహనం జరిగిపోయింది. ఆత్మహత్య కాబట్టి పోస్టుమార్టం, పోలీస్ రిపోర్టు అంటూ ఒక సబ్ ఇన్స్పెక్టర్ కొంచెం గొడవ చేశాడు. కానీ తర్వాత కిమ్మనకుండా వెళ్లిపోయాడు. అతను అలా ఎందుకు చల్లబడి వెళ్లిపోయాడో నాకు ఇప్పటికీ అంతుబట్టడం లేదు.

సంపత్ కుతూహలంగా వింటూ... "ఆ తర్వాత" అన్నాడు.

"చెబుతున్నాను సర్. మా వారు చనిపోయిన తర్వాత డిపాజిటర్ల గొడవ మరీ ఎక్కువైంది. ఇంతలో లింగారావనే ఒకతను నా వద్దకు వచ్చాడు. అతను మా వారి స్నేహితుడినని నాతో చెప్పాడు. మా ఇల్లు అమ్మించి




వచ్చిన డబ్బుతో ఖాతాదార్ల మీటింగు ఏర్పాటు చేసి వాళ్లను సముదాయించి కొంత కొంత ముట్టజెప్పించి బాకీలు చెల్లు వేయించాడు. కానీ మొదటగా నన్ను బూతు మాటన్న గుర్రపు ముఖం వాడు ఒప్పుకోలేదు. రసీదులు నా సంతకంతో వున్నాయని మొత్తం డబ్బు కావాల్సిందేనని పట్టుబట్టాడు. లింగారావుకు సహనం నశించి ఇవ్వకుంటే ఏం చేస్తావని అడిగాడు. దాంతో వాడు మళ్లీ తన కామవాంఛ తీరిస్తే డబ్బు మాఫీ అని ప్రతిపాదించాడు. దాంతో లింగారావు వాడిని చితకకొట్టాడు.'' ఆఖరు వాక్యం చెబుతున్నప్పుడు సులోచన కంఠంలో సంతోషం అసంకల్పితంగా వ్యక్తమైంది.

వాడు దెబ్బలు తిన్న సంగతి తెలియకున్నా సంపత్‌కు సంతోషం కలిగించింది. కానీ కొట్టిన లింగారావెవడు? ఈవిడ అప్పులు తీర్చడానికి, తగాదాలు పరిష్కరించడానికి పుట్టుకొచ్చిన ఈ ''గుడ్ సమారిటన్'' ఎవరు? ఈ ''మైల్స్ హెండన్'' గాడెవడు? ఈ ప్రశ్న అతని గుండెల్లో ఈర్ష్యతో బాటు ఈటెలా గుచ్చుకుంది. ఒంటరి ఆడది కనపడితే ప్రతి వాడూ హీరోనే. వీళ్లకు చొరబాటుతనం ఎలా వస్తుందోనని ఆలోచనల్లో పడ్డాడు. మళ్లీ గంభీరంగా

''ఈ లింగారావుగాడు కాదు లింగారావు గారెవరు? అనడిగాడు.

''అదేనండి చెప్పాస్తా. ఇతను చదువుకునే రోజుల్లో మా మేనమామగారింటి ఎదురుగా వరస ఇళ్లల్లో ఒక దాన్లో తల్లీ దండ్రితో పాటు వుండేవాడు. అన్నట్లు ఇతనికి ఒక చెల్లెలు వుండేది. ఆ అమ్మాయి, నేనూ తరచూ ఒకళ్లింటికి ఒకళ్లం వెళ్లేవాళ్లం. నా ఇంటర్ పూర్తి కాకుండానే అతను ఆ ఊరు విడిచి ఏదో ఉద్యోగం వచ్చిందని వెళ్లాడు. మళ్లీదాదాపు ఒకటిన్నర దశాబ్దం తరువాత ఈ మధ్యే చూట్టం. అతడు చెప్పిందాకా నాకు ఇవేమీ జ్ఞాపకం లేవు.

లింగారావు ప్రసక్తి సంపత్‌కు ఏమాత్రం రుచికరంగా లేదు. ముఖమంతా మాడిపోయింది. సులోచన లాంటి అప్సరస నోటి నుంచి లింగారావనే శబ్దం సుస్వరభరితమైన వేదగానంలో అపశృతిలా తోచింది.

''కానీండీ...కానీండి...కేసు సంగతి చెప్పండి''

''చెబుతానండి. తర్వాత అద్దె ఇంటికి మారాను. కానీ దెబ్బలు తిన్న గుర్రపు మొహం వెధవ నా మీద డిపాజిటర్ల రక్షణ చట్టమో అలాంటిదేదో దాని కింద నా మీద కేసు పెట్టాడు. ఇక మొదలు పోలీసు ఇన్స్‌పెక్టరు రోజుకు రెండు సార్లు వాడిష్టం వచ్చిన వేళల్లో వచ్చి అరెస్ట్ చేస్తానంటాడు. కానీ చేయడు. రోజూ బెదిరిస్తున్నాడు. ఏ అర్ధరాత్రి వచ్చి తీసుకెళతాడో తెలీదు. అనుక్షణం భయంతో బతకడం దుర్భరంగా వుంది''

సంపత్‌లో ఇన్నాళ్లు అణచిపెట్టుకున్న భయం స్థానే ధైర్యం చోటు చేసుకుంది. మనసు తొందర పెట్టడం ప్రారంభించింది. తనకు కావల్సింది ఈమె. ఈమె కోసమే తాను ఇన్నాళ్లు నిరీక్షించింది. నిరీక్షణ వృథా కాలేదు. అప్సరసలాంటి ఆడది దొరుకుతుంది. కాకపోతే కొంచెం చొరవ తీసుకోవాలి. ఈ లోకంలో ఆమె ఒంటరి స్త్రీ. ఆ వాస్తవం అతనికి గుండెబలాన్నిచ్చింది.

''మిమ్మల్ని నేను ఈ రోజే నా కారులో హైదరాబాద్ తీసుకెళతాను. నాల్రోజులు మిమ్మల్ని సురక్షితమైన ప్రదేశంలో వుంచి నేను వెనక్కు వస్తాను. మీకు ముందస్తు బెయిల్ సంపాదించి తర్వాత మనూరు తీసుకెళతాను''

సులోచనకు మార్గాంతరం లేదు. ఆ రోజే సంపత్‌తో బయలుదేరి హైదరాబాద్ వెళ్లి తాను జీవితంలో చూడని ఓ ఐదు నక్షత్రాల హోటల్‌లో బస చేసింది. ఆ రాత్రి ఆవిడ మంచం దగ్గరకెళ్లి ఆమెను మృదువుగా చుంబించాడు. ఆమె కళ్లలో లిప్తపాటు దిగులు కనిపించి మాయమైంది. ఆవిడేం ఆలోచించుకుందో కానీ కొంచెం జరిగి సంపత్‌కు పక్కలో చోటిచ్చింది. తిరస్కారం లేకపోవడంతో సంపత్ ఆ రాత్రి స్వర్గసుఖాలు అనుభవించాడు.

జీవితంలో ఇక పొందలేమనుకున్నది లభ్యమైనప్పుడు కలిగే ఆనందం అంతా అతని మొహంలో ప్రతిఫలిస్తోంది. మనసునిండా హాయి. ఆనందార్ణవపు లోతుల్లో ఈదిన అనుభూతి. ఆ మర్నాడు తనొక్కడే ఊరుకెళ్లి ముందస్తు బెయిల్ సంపాదించి ఆవిడను తీసుకెళ్లాడు.

ఒక వారం గడిచిందో లేదో సంపత్ మనసులో అసంతృప్తి. సులోచనను కలవాలి. ఈ ఊళ్లో వీలుపడదు. ఇక్కడ తననంతా గుర్తుపడతారు. ఒక ఆదివారం నాడు సులోచన మళ్లీ ఆఫీసుకు వచ్చింది. ఈసారి నిర్భయంగా మాట్లాడాడు. ఆమె భర్త తీర్చాల్సిన అప్పు తాను తీరుస్తాడు. కేసు రాజీ చేయిస్తాడు. ఆమెకు నెలకు ఆరువేల రూపాయలు పంపిస్తాడు. ఆమె చేయాల్సిందల్లా అతను కోరుకున్నప్పుడు హైదరాబాద్ వెళ్లి అతను చెప్పిన అడ్రస్‌లో కలవడం. అతను ఆమెను పోషిస్తున్న కారణంగా ఆమె మరెవరితోనూ సంబంధం పెట్టుకోకూడదు.

అంతా సాకల్యంగా వింది. కళ్లల్లో మళ్లీ దిగులు. క్షణం కాలం పాటు ఆలోచన. తర్వాత అతని ప్రతిపాదనలన్నింటిని యథాతథంగా ఒప్పుకుంది. ఆ తర్వాత వారానికి, పదిరోజులకు ఏదో వంకన హైదరాబాద్ వెళుతూ, ఆమెను రప్పించుకుంటూ రసరమ్య లోకాల్లో విహరిస్తున్నాడు. అంతా రహస్యంగా సాగిపోతోంది.

సంపత్ తనకు కొత్త జీవితం లభించినట్లుగా భావించాడు. ఈ విషయం తన భార్యకు సూచనమాత్రంగా కూడా తెలియకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. మనసు మారుమూలల్లో మళ్లీ భయం. ఈ సుఖం తనకు దక్కకుండా పోతుందేమో. ఈవిడ తన నుంచి విడిపోతుందేమో. ఏ లింగారావో, పుల్లారావో ఈవిడను తన నుంచి విడదీస్తారేమో.

ఒక రాత్రి ఆనంద పారవశ్యానంతరం ఆవిడకూ రంగనాథ్‌కు పరిచయం ఎలా జరిగిందో చెప్పమని కుతూహలంగా అడిగాడు.

''పెద్దగా చెప్పుకోవడానికి ఏమీ లేదు. అతను నేను పనిచేస్తున్న సూపర్‌మార్కెట్‌కు తరచూ వచ్చేవాడు. అలా పరిచయమైంది. ఒకనాడు. తనకూ ఎవరూ లేరని, డిగ్రీ తర్వాత ఉద్యోగమేమీ లేక బ్యాంకు లోనుతో చిన్న కిరాణా అండ్ ఫ్యాన్సీ షాపు నడుపుతున్నానని చెప్పాడు. పైపెచ్చు నన్ను గాఢంగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. మా మేనమామ అంగీకారంతో గుళ్లో పెళ్లి జరిగిపోయింది. తర్వాత జరిగిందంతా మీకు ఈ సరికే చెప్పాను''

''అంతేనా... రంగనాథ్‌తో అనుభవం నాతో అనుభవం ఈ రెండింట్లో నీకేమైనా తేడా కనపడుతోందా?''

సులోచన అమాయకంగా, విస్మయంగానూ చూసింది. అతని ప్రశ్నకు జవాబివ్వకుండా తన ధోరణిలో తను చెప్పసాగింది.

''అసలు రంగనాథ్‌కు నాతో కంటే ముందే మరొకావిడతో పెళ్లయిన సంగతి నాకు ఆలస్యంగా తెలిసింది. ఇల్లు అమ్మినప్పుడు తనకూ వాటా

వుందని ఎక్కడ్నుంచో ఒకామె వచ్చి గోల చేసింది. లింగారావే ఎలా పరిష్కరించాడో గానీ మళ్లీ ఆవిడ నా ఛాయలకు రాలేదు.'' సులోచన చెప్పసాగింది.

''రంగనాథ్ స్వభావం నాకు ముందు అర్థం కాలేదు. నన్ను మా కంపెనీ మేనేజర్ సీటులో కూర్చోబెట్టి ఆ ఆకర్షణతో చాలా డిపాజిట్లు రాబట్టాడు. అన్నింటికంటే విచిత్రమేమిటంటే అతను చనిపోయేనాటికి ఇంట్లో ఒక్క పైసా లేదు. ఏ బ్యాంకులోనూ డబ్బు లేదు. అతనిపేరు మీద కానీ, నా పేరు మీద కానీ లేదు. అంతా ఏం చేశాడో ఏమో ఆ ఆచూకీ ఏమీ దొరకలేదు.''

మరి మాట్లాడనీకుండా సంపత్ ఆమెను ఆక్రమించుకున్నాడు. ఈమె నాది... ఈమె నా ఆస్తి... నా స్వంత ఆస్తి... కాకపోతే భూ ఆక్రమణదారుల్లా నేనీమెను ఆక్రమించుకున్నాను. ఈవిడ మీద మరొకడు చేయి వేయకూడదు. తనో ఆవిడో చనిపోయేదాకా ఈవిడ తన ఆస్తే. ఇలా ఆలోచిస్తూ సంపత్ నిద్రకొరిగాడు.

***

ఉల్లాసంగా కూనిరాగం తీస్తూ వంటింట్లో పని చేసుకుంటున్న సులోచన ముందు గది తలుపులు తోసుకొని ఎవరో వచ్చిన అలికిడి వినిపించింది. వెళ్లి చూస్తే లింగారావు. ఒక కుర్చీ లాక్కుని కూలబడ్డాడు. కాస్త ఆ ఫ్యాన్ వేయకూడదు? సులోచన ఫ్యాన్ ఆన్ చేసి తనూ ఒక కుర్చీలో కూలబడింది.

''సులోచనా... ఇది అడగకూడని ప్రశ్నే అనుకో. అయినా నీ పట్ల నాకున్న ప్రేమతో అడుగుతున్నా. గత కొద్ది రోజులుగా ప్రతి నెలా కొన్ని రోజులు నీ ఇంటికి తాళం వేసుంటోంది ఎటెళ్తున్నావు?''

సులోచన గుండె గతుక్కుమంది. తెలిసే అడుగుతున్నాడేమోననే అనుమానం కూడా వచ్చింది.

''ఏమీ లేదు ఈ మధ్య అప్పుడప్పుడు ఆరోగ్యం బాగుండడం లేదు. మా మామయ్యగారి ఊరు వెళ్లొస్తున్నాను''

అనారోగ్యం అనగానే లింగారావు కలవరపడ్డాడు. '' ఏం నేను చచ్చిపోయాననుకున్నావా? నాకు చెబితే తోడు వచ్చేవాడినిగా'' అన్నాడు.

ఈ కలవరానికి, ఇంత వరకూ ఇతను తన విషయంలో చేసుకుంటున్న జోక్యానికి కారణాలు తెలియనిసులోచన కొంచెం గాభరా పడింది.

''సాయంకాలం వస్తాను'' నీతో వివరంగా మాట్లాడాలి'' అంటూ వెళ్లిపోయాడు.

సులోచనకు వంటింట్లోంచి మాడు వాసన వచ్చింది.

ఆ సాయంకాలం లింగారావొచ్చి ఎలాంటి ఉపోద్ఘాతాలు లేకుండా సూటిగా విషయంలోకివచ్చాడు.

''సులోచనా... నిన్ను నీ పధ్నాలుగో ఏట నుంచే ప్రేమిస్తున్నాను. మీ వీధిలో నువ్వు చూడకుండా నిన్నుచూస్తూ మీ ఇంటి ముందు నుంచి లేని పనులు కల్పించుకొని తిరిగేవాడిని ఏడాదేడాది నువ్వు ఏపుగా ఎదుగుతూ వస్తుంటే నిన్ను కన్నార్పకుండా చూసేవాడిని.

సులోచన ఇబ్బందిగా మొహం పెట్టింది. ''అవునూ... నువ్వు అకస్మాత్తుగా మనూరి నుంచి వెళ్లిపోయావు. మళ్లీ ఇన్నేళ్లకి ఈ మధ్యనే కదా నిన్ను చూడడం. ఏమైపోయావు?''

''సులోచనా నన్ను ఆపకు ప్లీజ్..అంతా చెపుతాను.''

సులోచన తలాడించింది.

''నువ్వు కామమనే పేరుపెడతావో. మరేం పేరు పెడతావో నీ ఇష్టం. నేను మటుకు నువ్వు నడిచినంత మేరా మల్లెపూలు పరవాలని, నీ పక్కమీద సంపెంగలు చల్లాలని కోరుకునేవాడిని. నాది ఆరంభ యవ్వనంలో కలిగిన ప్రేమ. ఇది ఇన్‌ఫాట్యుయేషన్ మాత్రం కాదు. నిన్ను పెళ్లి చేసుకోవాలని ఆలోచించేవాడిని. చేసుకున్నట్లుగా కలలు కనేవాడిని''

''నా ప్రశ్నకు బదులివ్వకుండా...''

''అదే చెబుతాను. మీ మేనమామ వాళ్లు బీద వాళ్లు. అలాగని మా పరిస్థితేం మెరుగ్గా లేదు. ఇంట్లో పెళ్లి కావాల్సిన చెల్లెళ్లు, అనారోగ్యపు తల్లి. అల్పాదాయపు తండ్రి. మా కుటుంబం సగటు మధ్య తరగతి కుటుంబాలకు భిన్నమేమీ కాదు.''

''నేనొకటి అడుగుతా. నువ్వొకటి చెబుతావు?''

''అబ్బే అది కాదు. అలాంటి రోజుల్లోనే బాగా డబ్బు సంపాదించుకురావాలని బుద్ధి పుట్టింది. ముంబాయి వెళ్లిపోయాను. ఒకతని ద్వారా ఒక బడా స్మగ్లర్ పరిచయమయ్యాడు. వాడి చేతి కింద అడ్డమైన పనులూ చేశాను. ఓడల్లోంచి బోటుల్లో బంగారాన్ని అక్రమంగా ముంబాయికి చేర్చేవాడిని. కస్టమ్స్ వాళ్ల కళ్లుకప్పడంలో నైపుణ్యం సంపాదించాను. మా యజమాని విశ్వాసం సంపాదించి తర్వాత కొన్నేళ్లకు ఆయనకు నా కష్టాలన్నీ చెప్పి నన్ను విడుదల చేయమన్నాను. సరే నేను ఎలా డబ్బు సంపాదించానో.. ఎవర్ని మోసం చేశానో అంతా చెబితే సినిమా కథ అవుతుంది. మొత్తానికి బాగా డబ్బు సంపాదించి తిరిగి వచ్చాను''


సులోచన విస్మయంగా చూస్తోంది.

''ఈ ఊర్లో వున్నావని తెలిసి ఇక్కడకొచ్చి ఇల్లు కొనుక్కున్నాను. ఇన్సూరెన్స్ ఏజెన్సీ సంపాయించి డెవలప్‌మెంట్ ఆఫీసర్నయ్యాను. ఊళ్లో పెద్దవాళ్లతో పెద్ద పెద్ద ఆఫీసర్లతో పరిచయం వుంది''



## ఇరిటేషన్ వచ్చింది

ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే ఎక్స్‌పోజింగ్ చేయాలి. మరి అవకాశం రావాలిగా ఎక్స్‌పోజ్ చేసేందుకు. అయినా వెయిట్ చెయ్యమని చెబుతున్నారు. ఆరేళ్లు అవకాశం వేచి చూశాను. ఛాన్స్ రాలేదు. ఒక వేళ వచ్చినా రిలేషన్‌షిప్స్ మెయింటెయిన్ చెయ్యమని అంటున్నారు. అయినా ఇంత కాలం వేచిచూసిన నాకు ఇండస్ట్రీమీదే ఇరిటేషన్ వస్తోంది. బాలీవుడ్ సినిమాల కన్నా మోడలింగే నయమని అనిపిస్తోంది. నాకు మొట్టమొదటి సారిగా గౌతమ్ రాజ్యాధ్యక్ష అనే డైరెక్టరు అడ్వర్టయిజింగ్‌లో నటించేందుకు అవకాశమిచ్చింది. అది చాలా మంచి ఎక్స్‌పీరియన్స్. పర్సునిండా డబ్బు వచ్చింది. ఉక్కిరి బిక్కిరయ్యాను. ఏం లాభం బాలీవుడ్‌లో అవకాశం రాలేదు. అయినా నాకనవసరం. నేను మళ్లీ మోడలింగ్‌కే వెళతాను అంటూ తన బాధనంతా వ్యక్త పరుస్తోంది పాపం తేజస్విని.




సులోచన విభ్రమం నుంచి తేరుకోలేదు. ఆమె కళ్ల ముందు భర్త దహనక్రియలు, పోలీసు వాడు గొడవ చేయకుండా వెళ్లిపోవడం, చాలా మంది ఖాతాదారులు తనిచ్చిన డబ్బుతో తృప్తిగా వెళ్లిపోవడం సినిమా దృశ్యాలుగా కనిపిస్తున్నాయి. అయితే దీని వెనుక వుంది ఇతనా. తనకు తెలీదు. మరి తన మీద కేసును ఎందుకు మాఫీ చేయించ లేకపోయాడు?

ఆమె ఆలోచనలను అర్థం చేసుకున్నట్లుగా చిన్నగా నవ్వి " ఓ వారం రోజులు ఊరికెళ్లి వచ్చేటప్పటికి నీ మీద కేసు బుక్ కావడం జరిగిపోయింది. వాడు నా మాట వినలేదు. వాడిని హింసాత్మకంగా అడ్డు తొలగిస్తే అనుమానం నీ మీదా నా మీదా రావచ్చు. అంచేత తర్వాత చూసుకుందాంలే'' అని ఊరుకొన్నాను. ఈ లోపునువ్వు సరైన పనేచేశావు. సంపత్ దగ్గరకెళ్లి బెయిల్ సంపాదించుకున్నావు.

సులోచన మళ్లీ ఆలోచనల్లో పడింది. తనకూ సంపత్‌కు వున్న సంబంధం ఇతడికి తెలుసా? తెలిసే బయట పడడంలేదా? తనకు తానుగా చెబితే అతని మనసు గాయపడుతుందా? ఆవిడకు లింగారావు మీద కొంచెం కొంచెంగా అభిమానం పెరుగుతోంది.

లింగారావన్నాడు ''సులోచనా సంపత్ మంచివాడు. ఏ చెడ్డ అలవాట్లూ లేవు. అతని మంచితనం అతను నీ మీద కేసు లోక్ అదాలత్‌లో మాఫీ చేయించినప్పుడే తెలిసింది.

సులోచన మనసు నెమ్మదించింది. ఇంకా ఇతనికి సంపత్‌తో తన సంబంధం గురించి తెలియదు.

''చూడు... నువ్వు ఒంటరి ఆడదానివి. ఈ లోకంలో ఈ రోజుల్లో నీలాంటి ఆడది ఒంటరిగా బతకడం కష్టం. నీకు పెద్ద చదువూ లేదు. వెనుక ఆస్తిపాస్తులూ లేవు. నీ వాడంటూ నీ మనిషీ లేడు. నాకు నీ గతం అంటే నీకు రంగనాథ్‌కు పెళ్ళి, నువ్వు గడిపిన రోజులూ అనవసరం. నేను నిన్ను పెళ్లి చేసుకోవడానికి సిద్ధంగా వున్నాను''

సులోచన బలహీనంగా నవ్వి ''నన్ను నాలుగు రోజులు ఆలోచించుకోనివ్వు'' అనగలిగింది.

ఆ తర్వాత సంపత్‌ను హైదరాబాద్‌లో కలిసినప్పుడు తనను పెళ్లిచేసుకోమని కోరింది. అతడు విచిత్రంగా చూసి ''అదెలా? నాకు భార్యా పిల్లలున్నారు. వాళ్లు గుండాగి చచ్చిపోతారు'' అన్నాడు.

''మీకు నా మీద ప్రేముందా?''

''అంత కచ్చితంగా అడిగితే చెప్పలేను. కానీ నీవంటే వల్లమాలిన ఇష్టం వుంది. నీకు దూరమై బతికే ధైర్యం లేదు. పైపెచ్చు అలాంటి బతుకులో ఏమాత్రం రుచి వుండదని మటుకుచెప్పగలను''

''ఎందుకు పెళ్లి చేసుకోరు? ఎంత మంది రెండవ పెళ్లి చేసుకోవడం లేదూ? నేను మీ కులం కాదనా?''

''పిచ్చీ...అవేవీ కాదు. నేనింతకు ముందే చెప్పిన కారణమే. సెక్సుకూ, డబ్బుకూ నాకు కులం పట్టింపు లేదు. డబ్బు ఎవరిచ్చినా తీసుకొంటాను''

సులోచన సందిగ్ధంలో పడింది. సంపత్‌ది గొప్ప మనసా? లింగారావుది గొప్ప మనసా? ఇద్దరూ తనకు ఆపదలో సహాయం చేశారు. సంపత్ వుంచుకుంటానన్నాడు. లింగారావు పెళ్లి చేసుకుంటానన్నాడు. తాను సంపత్‌కు ఏమి సహాయం కావాలో చెపితే చేశాడు. లింగారావు తనకేం కావాలో తనుకు తానుగా తెలుసుకొని చేశాడు. పెళ్లనగానే సంపత్ కొట్టిపారేశాడు. లింగారావు తన గతాన్ని తెలిసీ పెళ్లి చేసుకుంటానన్నాడు. ఏ రకంగా చూసినా తన మనసు లింగారావు వైపే మొగ్గుతోంది. సంపత్‌తో ఎన్నాళ్లున్నా ఉంపుడుగత్తె స్థాయి మాత్రమే. లింగారావుది అలా కాదు. అతను చెప్పిన విషయాలు విన్నప్పటి నుంచి నిజమైన ప్రేమంటే అతనిదే అని తెలుస్తోంది.

''ఏంటి? ముభావంగా వున్నావు?'' సంపత్ అడిగాడు.

సులోచన నిర్ణయించుకుంది. గట్టి మనసుతో చెప్పింది. ''నేను లింగారావును పెళ్లాడబోతున్నాను''

సంపత్ నెత్తి మీద పిడుగుపట్టయింది. ''అలా వీల్లేదు'' అని అరిచాడు. నువ్వు నాకే స్వంతం. నువ్వు నా ఆస్తి. నీ మీద మరొకడు చేయి వేయడం నేను సహించడం కాదు, ఊహించను కూడా లేను. నీతి లేనిదానా....

సులోచన తాచుపాములా లేచింది. ''నువ్వు నీ భార్యతో కాపురం చేస్తావు. ఇటు ఆవిడకు కానీ మరొకడికి కానీ తెలియకుండా నాతో సుఖపడతావు. నీకు నీతుందా;? సెక్సుకూ, డబ్బుకూ కులం లేదనే మనిషివి. నీకు మనుషుల మీద ప్రేముందా? నువ్వు నీతిమంతుడివా? రేపే లింగారావును పెళ్లాడతాను. నువ్వేం చేస్తావో చూస్తాను. నీ పరువు మర్యాదలను విడిచిపెట్టి బయటకురా లేవు. విసవిసా వెళ్లిపోయింది.

''ఒక్క మాట లింగారావును చేసుకున్నా సరే. వాడు లేనప్పుడు నన్ను రానిస్తావుగా...అభ్యంతరం పెట్టవుగా....''

''ఛీ....నేను రంగనాథ్‌తో కాపురంలో మరెవరి వంకా చూడలేదు. నీతో వున్నప్పుడూ అంతే... రేపు లింగారావుతో వున్నా అంతే... ఒక్క సమయంలో ఒక్క మొగుడే... నీలా ఇంట్లో పెళ్లాం. బయట వేరే సంబంధం పెట్టుకున్నట్లునేను ఇంట్లో మొగుడుబయట విటుడితో సంబంధాలు పెట్టుకోను. కావలిస్తే పెళ్లి చేసుకో. నేనెలాంటిదాన్నో నీకే తెలుస్తుంది.''అలుపుతో ఆగింది.

***

ఆ తర్వాత సంపత్‌కు నిద్ర కరవైంది. అన్నం సహించడం లేదు. పరధ్యానం ఎక్కువైంది. ఇంట్లో సువర్చల అతనికి తాయెత్తులు కట్టించింది. పూజలు చేయించింది. ఆ తర్వాత సంపత్ బతుకు దుర్భరమైంది. నిద్రపట్టదు. బలవంతంగా కళ్లు మూసుకున్నా లింగారావు, సులోచనలు ఏకశయ్యాగతులైన దృశ్యం కళ్లముందు కనపడేది. లింగారావు కౌగిలిలో సులోచన కిలకిలా నవ్వుతున్నట్లు, ఆ నవ్వుల సవ్వడి తన చెవుల్లో మారుమోగినట్లు భ్రమపడి దిగ్గున లేచిపోయేవాడు. అతని భార్యకు ఇవేమీ అర్థమయ్యేవి కావు. మొత్తానికి అతను ఏదో తీవ్రమైన మానసిక అసంతృప్తితో వున్నాడని గ్రహించుకుంది.

సంపత్‌కు కాస్సేపు నిద్ర పడితే పీడకలలు. సులోచనను తాను స్పృశించిన అంగాంగాలను లింగారావు తాకుతున్నట్లుగా సులోచన వైణికుడి చేతిలో వీణలా, ఆమెపారవశ్యపు మూలుగులు, వీణానాదంలా వినిపించేవి. మళ్లీ నిద్ర లేచిపోయేవాడు. సులోచనను తాను పెళ్లిచేసుకుంటే ఏమయ్యేది. తాను అనుకుంటున్న పరువు మర్యాదలు అంతా మిథ్య. తాను సులోచనకు అన్యాయం చేశాడు. ఏది ఏమైనా సరే తన విషయమంతా భార్య సువర్చలకు చెప్పాలి. ఇలా నిర్ణయం తీసుకొని ఒకనాడు భార్యకు తన విషయం పూస గుచ్చినట్లుగా ఏదీ దాచకుండా చెప్పాడు. అంతా సావధానంగా విన్న సువర్చల ''మీరు తప్పు చేశారు. ఏ దిక్కులేని ఆడమనిషిని లింగారావుపాలు చేశారు. మీరు ఆవిడను పెళ్లి చేసుకున్నా నేనేమీ అనేదాన్ని కాదు. అఘాయిత్యం చేసుకునేదాన్ని కాదు. మీరు ఇలాంటి పనిచేశారన్న బాధ కంటే మీరు ఇన్నాళ్ల

కాపురంలో నన్ను అర్థం చేసుకోలేకపోయారన్న బాధ వుంది. పాపం సులోచన. ఆ లింగారావు ఎలాంటి వాడో'' అని అనుమానం వ్యక్తం చేసింది.

''కాదు సువర్చలా'' అంటూ ఏదో చెప్పబోయాడు.

చూడండి మీకు ఒక అనుభవం కలిగింది. మనిషికి సంభవించిన సంఘటనల అనుభవంగా భావించకూడదు. ఆ సంఘటనల అనుభవంతో అతను ముందు ముందు ఏం చేస్తాడో చూసి దాని ద్వారా మాత్రమే అతనికి అనుభవం పనికి వచ్చింది రానిదీ నిర్ణయించగలం. ఇలా ఎక్కడో చదివిన గుర్తు అంది.

సంపత్ భార్య వంక అలాచూస్తూ వుండిపోయాడు.

పైగా మీ వ్యవహారం లోకంలో ఎవరికీ తెలియదు అనుకున్నారు. నిజానికి ఇది చాలా మందికి తెలుసు. అట్లాంటివి భార్యకు మటుకే చాలా ఆలస్యంగా తెలుస్తాయి.

***

లింగారావు సులోచనల పెళ్లి తర్వాత దాంపత్యం సుఖమయంగా సాగిపోతోంది. అయితే లింగారావుకూ ఒక రకమైన అసంతృప్తి. ఈమె స్వచ్ఛంగా నా సొత్తు కాదు. రెండు చేతులు మారింది. లైంగికంగా ఈమె తనతో పూర్తి స్థాయి సంతృప్తి చెందుతోందా? తనతో కంటే రంగనాథ్‌తో ఎక్కువ సంతృప్తి పొందిందా. సంపత్‌ను తానుఅనుమానించేవాడు కాదు. కానీ సులోచన తనకు తానుగా ఆ విషయాలు యావత్తూ పూసగుచ్చినట్లు చెప్పేసింది. పెళ్లికి ముందువేవీ అంత పట్టించుకోవలసిన విషయాలు అనిపించలేదు. తీరా పెళ్లయిన తర్వాత మాటి మాటికి సంపత్ గుర్తుకొస్తున్నాడు. అమాయకంగా ఆవిడ జీవితం తనచేతుల్లో భద్రంగా వుందన్న విశ్వాసంతో నిద్రలో మునిగిపోయిన సులోచన ముఖం అతనిలో అనుమానాలురేకెత్తించింది. ఆ సంతృప్తి, ఆ పారవశ్యం తన వల్ల కలిగినవేనా? లేక సంపత్‌నో, రంగనాథ్‌నో తలుచుకుంటూ వాళ్లను ఫాంటసైజ్ చేస్తూ తనతో వుంటున్నదా? నిజంగా ఇష్టంతో తనను పెళ్లి చేసుకుందా? తన జీవిత భద్రతకు మాత్రమే తన పెళ్లి ప్రతిపాదనను ఒప్పుకుందా? ఎందుకో అతనికి ఆవిడంటే మొహం మొత్తింది. అంతులేని ఆలోచనలు అతడిని సదా బాధిస్తున్నాయి. ఇంకో రకమైన ఆలోచన తరచూ బాధిస్తున్నది. తాను ఆమెను ప్రేమించాడా? కామించాడా? అనవసరంగా ఆవిడ మీద చాలా డబ్బు ఖర్చు చేశాడేమో. మొత్తానికి అతను సుఖపడలేకపోతున్నాడు. అలా అలా చూస్తుండగానే రెండేళ్లు గడిచిపోయాయి. ఒక రోజు పొద్దున్నే నిద్ర లేచిన సులోచనకు లింగారావు కనపడలేదు. కానీ సులోచన పేరు మీద ఒక ఉత్తరం దొరికింది.

సులోచనా...

నీ మీద నాకున్నది ప్రేమే అనుకున్నాను. అది నా ఆరంభ యవ్వనంలో నీ మీద కలిగిన కాంక్ష తాలుకూ వెంటాడే తీవ్రత అని తెలుసుకోలేదు. నా మనస్తత్వం నీకు తెలియదు. నేను పొందాలనుకున్నది పొంది తీరుతాను. ఎంత కాలమైనా వేచి సాధిస్తాను. ఇప్పుడు నీ మీద నాకెలాంటి మోహమూ లేదు. ఇంత కన్నా అందగత్తె దొరికితే ఏమో చెప్పలేను. పెళ్లి మటుకు ఎవరినీ చేసుకోను. ఈ మధ్య నీ అందం మొహం మొత్తింది. రెండు చేతులు మారిన నిన్ను నా దానిగా విశ్వసించలేకపోతున్నాను. అందుకే వెళ్లిపోతున్నా. నీకోసం మనం వుంటున్న ఇల్లు మాత్రం సర్వహక్కులతో నీకే చెందుతుంది. అది కట్టేటప్పుడే నీ పేరు మీద రికార్డుల్లోకి ఎక్కించాను. డబ్బు ఏమీ వదలడం లేదు. బంగారం నీ ఒంటి మీద వున్నదే. నీకు మళ్లీ కనిపించను. నీకు మరో విషయం చెప్పాలి. రంగనాథ్ డబ్బు ఏం చేశాడో నీకు తెలియదు. రంగనాథ్‌కు ఒక ఉంపుడుగత్తె వుండేది. ఆవిడ ప్రస్తుతం చెన్నయ్‌లో వుంది. వాడు నిన్ను జనానికి చూపించి సంపాదించిన డబ్బు దాని ఎదాన కొట్టాడు. ఆ తర్వాత అది ఛీ కొట్టింది.

అతను చనిపోయినప్పుడు వచ్చినామె అతని మొదటి భార్య కాదు. నేనురప్పించిన ఒకావిడ. నీ కష్టాలు చాలా తీర్చానని నువ్వు భావించడానికి ఈ నాటకం కూడా ఆడాను. నీవు అందగత్తెవు కాదని ఎవడైనా అంటే అది వాడి దృష్టి లోపం. నీ అందం నిజమే కానీ ఆ అందం ఒకటే నాకు చాలదనిపిస్తోంది. లోకంలో ఇంకా చాలా అందాలున్నాయి.

నీ

లింగారావు

***

సులోచన దీర్ఘంగా నిట్టూర్చింది. ఏమిటో ఈ మగవాళ్లు. ఆడదాన్ని ఆస్తిగా, ఆస్తిమజ్జాగతమైన ప్రాణిగా తప్ప ఆ ప్రాణికి ఒక మనసుంటుందని గుర్తించలేనివాళ్లు. సులోచన మనసులో ఒక ప్రశ్న ఆమెను నిరంతరం బాధిస్తున్నది. తనమీద సంపత్ చూపించింది స్వచ్ఛమైన ప్రేమా? లేక లింగారావుది స్వచ్ఛమైన ప్రేమా? ఆవిడ తన కథంతా ఎవరికైనా చెప్పి జవాబు పొందాలనుకుంటున్నది. అయితే ఆవిడ కథ అంత సావధానంగా సానుభూతితోనూ వినేవాళ్లెవరూ కనపడడం లేదు. లింగారావు అంత స్పష్టంగా ఉత్తరం రాసినా తాను లింగారావును శంకించలేకపోతున్నది. ఒకనాడు ఒక మాజీ సహోద్యోగిని ఆమె కథంతా విని నీలాంటి వాళ్లు లింగారావులాంటి వాళ్లున్నంత కాలం నీలాంటి ఆడాళ్లు మోసపోతూనే వుంటారు అంది. ఆ సమాధానం సులోచనకు అర్థం కాలేదు.

***

సులోచన మళ్లీ సూపర్ మార్కెట్‌లో తన పాత ఉద్యోగంలో చేరింది. తన వెనుక తన కన్నా చిన్నవాళ్లు, పెద్దవాళ్లు చేస్తున్న వ్యంగ్య వ్యాఖ్యానాలను ఒక చెవితో విని మరో చెవితో వదిలేస్తున్నది. నిర్లిప్తంగా నిర్వికారంగా తన పని తానుచేసుకుపోతున్నది.

ఆ రోజు ఆ చెయిన్ సూపర్ మార్కెట్ల ఎండి వచ్చారు. యధాలాపంగా సులోనను చూసీ చూడగానే ఆ ప్రౌఢత్వపు అందాలు అతని కళ్లను జిగేలుమనిపించాయి.

ఆ సాయంత్రం గెస్ట్‌హౌజ్‌లో టీ తాగుతూ స్థానిక మేనేజర్ రామ్మూర్తి నడిగాడు. ''మూర్తి ఎవరామె?''

అర్థం అయిన మూర్తి ''అబ్బో పెద్ద కథలేండి'' అన్నాడు.

''వీలు పడుతుందేమో కనుక్కో'' అన్నాడు ఎండి.

కా(మ)ల చక్రం తిరుగుతూనే వుంది.

